మా నాన్నగారు రిటైర్ అవడంవల్ల ఇరవై ఏళ్ళుగా ఉన్న సింధియా న్యూ కాలనీ క్వార్టర్ నుంచి గాజువాకలో కొత్తగా కట్టుకున్న సొంత ఇంట్లోకి మారిపోయాం. అయినా వారాని కోసారైనా కాలనీ వెళ్ళి తెలిసిన వాళ్ళతో మాట్లాడి రాకుండా ఉండలేకపోతున్నాను.

ఈ రోజు కూడా ఆఫీను నుంచి ఇంటి కెళ్ళి కాలనీకి వచ్చాను. మళ్ళీ కాలనీ నుంచి ఇంటికి బయలుదేరేసరికి రాత్రి తొమ్మిదైపోయింది. బస్ స్టాపుకు వచ్చిన అయిదు నిముషాలకి ఏభై అయిదో నంబరు బస్సు వచ్చింది. అది సింధియా నుంచే బయలుదేరుతుంది కాబట్టి ఖాళీగానే ఉంది. ముందునుండి ఎక్కి లేడీస్ సీట్లు దాటి ఖాళీగా ఉన్న సీట్లో కూర్చున్నాను.

అంతవరకూ అందరితో మాట్లాడి వచ్చానేమో కాస్త నీరసంగా ఉంది, తొమ్మిది దాటిపోవడంవల్ల కొద్దిగా ఆకలి కూడా వేస్తూంది. వేసవి కాలమే అయినా గాలి చల్లగా వీస్తుంది కిటికీలోంచి.

బస్సు నౌసేనా బాగ్ స్టాపు దగ్గర ఆగి మళ్ళీ బయలుదేరుతున్నప్పుడు పడింది నా దృష్టి నా సీటుకి ఎదురు సీట్లో కూర్చున్న 'ఆమె' మీద. అలా ఆమెమీద నా దృష్టి సహజంగానే పడినా వెనుక నుంచి కనిపిస్తున్న ఆమె రూపురేఖలు నాలో అలజడిని కలిగించాయి.

ఎందుకంటే ఆమెది చిన్న చిన్న ఉంగరాల జుట్టున్న తల. పైగా జడ వేసుకోకుండా రబ్బర్ బాండ్‌తో పోనీ టైల్ వేసుకుంది. చెవికి పొడవుగా గుత్తులుగా వేళాడుతూ చిన్నగా, అందంగా కదులుతున్న - లోలకు లంటారో, ఏమంటారో - అవి ఉన్నాయి. కోలముఖం అని తెలుస్తుంది. బుగ్గలు మాత్రం కాస్త గుండ్రంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. చెంపలమీద చెవి కిందవరకూ నూనూగు వెంట్రుకలు... అదేమిటో ఆమె ఏమాత్రం తల పక్కకు తిప్పడంలేదు. బిగుసుకుపోయి కూర్చున్నట్లు అనిపించింది నాకు.

వెనుకనుంచి కనిపించిన ఆమె పోనీ టైల్, గుండ్రని బుగ్గలు, చెంపలమీద ఉన్న నూనూగు వెంట్రుకలు, ఆమె ఏమాత్రం తల తిప్పకుండా ఆ కూర్చోవడం - వీటివల్లే ఆమెను చూసిన నాలో ఆ అలజడి.

ఎందుకంటే సుజాత అలాగే ఉంటుంది.

బస్సు మాల్కాపురం దగ్గర ఆగింది. అక్కడ చాలామంది ఎక్కడంవల్ల బస్ రష్ అయిపోయింది. నేను మాత్రం ఆమెనే గమనిస్తూ కూర్చున్నాను.. ఆమె ఎప్పుడు తల పక్కకు తిప్పుతుందా, సుజాత అవునో, కాదో తెలుస్తుందా అని ఎదురుచూస్తున్నాను. నే నదేపనిగా ఆమెను చూడ్డం ఒక రిద్దరు గమనిస్తున్నట్టు నాకు అనిపించడంవల్ల నే నామె వైపు చూడ్డం మానేశాను కానీ, ఆమెను చూడకుండా ఉండలేకపోతున్నాను. ఆ పరిస్థితి నాకు చాలా ఇబ్బందిగా ఉంది.

వెనకనుంచి చూస్తే ఆమె అచ్చం సుజాతలా ఉండకపోయి ఉంటే నాలో ఇంత ఉత్సుకత కలిగి ఉండేది కాదు. కానీ, ఆమె సుజాత లాగే ఉంది.

'లాగే' ఏమిటి? ఆమె సుజాతే అయ్యుంటుంది! నేను బస్సెక్కినప్పుడు చూసి ఉంటుంది. అమె వెనుక సీట్లో కూర్చోవడం గమనించి ఉంటుంది. అందుకే తల ఏమాత్రం పక్కకు తిప్పకుండా అలాగే ముడుచుకొని కూర్చుంది.

ఆమె ఒక్కసారి తల తిప్పినా బాగుండును. కనీసం పక్కనుంచైనా చూసి ఆమె సుజాత అవునో, కాదో తేల్చుకొనేవాడిని.

ఆమె సుజాత కాకపోతే పర్వాలేదు... సుజాత అయితే మాత్రం...

ఆ ఊహకే నా గుండెలో అ దో రకమైన కదలిక కలిగింది.


నా మనసు ఒక్కసారిగా వెనక్కి వెళ్ళిపోయింది.

సుజాత మా దూరపు బంధువుల అమ్మాయి. ఏవో చిన్న చిన్న కారణాలవల్ల మా కుటుంబాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి.

నేను డిగ్రీ చదువుతుండగా ఓ రోజు అకస్మాత్తుగా ఓ అమ్మాయి వచ్చింది మా ఇంటికి. ముందుగా ఆ అమ్మాయిని చూసింది నేనే. నావైపు చూసి పలకరింపుగా నవ్వింది. ఆ అమ్మాయి ఎవరో నేను గుర్తు పట్టలేకపోయాను.

"అత్తయ్య లేదా బావా?" అంది నాతో. మా ఇంటి ఫెన్సింగ్ గేటు తీసుకొని వరండాలోకి వచ్చేలోపుగా నన్ను ఆకర్షించింది ఆ అమ్మాయి అందం. ఇప్పుడు ఆమె మృదువైన కంఠస్వరానికి, ఆ కంఠం నన్ను పిలిచిన పిలుపుకీ నా మనసు అదోలా అయిపోయింది.

"అలా గుడ్లప్పగించి చూస్తూ



ఉండిపోయావేమిటి? నన్ను గుర్తు పట్టలేదా? సుజాతను. రామ్మూర్తిగారి అమ్మాయిని."

అప్పుడు గుర్తొచ్చింది నాకు సుజాత. అంతలో అమ్మ కూడా వచ్చింది. అమ్మ కూడా సుజాతను గుర్తు పట్టలేదు. అమ్మకు నేనే చెప్పాను. అమ్మ సుజాతతో ఆదరంగా మాట్లాడింది.

మాటల మధ్యలో - "ఏవో చిన్న కారణాలవల్ల మన కుటుంబాలు చెదిరిపోయాయి గానీ, మీ చిన్నప్పుడు ఎంతో ఇదిగా ఉండేవాళ్ళం" అంది అమ్మ.

నేను గదిలో పందిరి మంచంమీద పడుకొని వాళ్ళ మాటల్ని వినడం కంటే సుజాత అందాన్నే ఎక్కువగా చూస్తున్నాను.

ఎంత మారిపోయింది సుజాత? చిన్నప్పుడు ఎలా ఉండేది? పీలగా ఉంగరాల జుత్తు తప్ప మనిషిలో ఇంకేమీ కనిపించేది కాదు. మరి ఇప్పుడు? అనుభవంతో పండిపోయిన ఓ శిల్పి చెక్కిన శిల్పంలా ఉంది.

ఈ రోజు ప్రాక్టికల్స్ లేకపోవడంవల్ల, ఉన్న ఒక్క పీరియడుకూ అంతదూరం వెళ్ళడం ఎందుకులే అని బద్ధకించి ఇంటి దగ్గర ఉండిపోవడంవల్ల గానీ లేకపోతే సుజాతను చూడలేకపోయేవాడిని కదా !

అమ్మ కాఫీ చేయడానికి వంట గదిలోకి వెళ్ళింది.

సుజాత బెడ్‌రూమ్‌లోకి వచ్చింది.

"నేను నిన్ను మరిచిపోలేదు గానీ నువ్వు నన్ను మరిచిపోయావు. అలాగే ఉంటుందిలే !" అంది.

"నీలో వచ్చిన మార్పువల్ల గుర్తు పట్టలేదు సుజాతా !"

"అదేం కాదు, నాలాంటిదాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం నీ కేముంది?"

"అది కాదు, సుజాతా ! నువ్వంటే ఆడపిల్లవు. ఆడపిల్లలు ప్రతి ఆరు నెలలకూ మారిపోతుంటారట. నిన్ను చూసి ఎన్నేళ్ళయ్యింది చెప్పు? పీలగా ఉండే పిల్లలాగే నాకు గుర్తున్న నువ్వు, రంభలా ఎదురైతే ఎలా గుర్తు పట్టగలను?

నా పొగడ్తకు సిగ్గుతో ముడుచుకుపోయింది సుజాత.

"నాకు మాత్రం ను వ్వెప్పుడూ గుర్తుంటావు" అంది సుజాత.

"ఎలా?"

"మన చిన్నప్పుడు ఓసారి నేను మీ ఇంటికి వచ్చాను. ఏదో గొడవ జరగడంవల్ల బస్సులు ఆగిపోయాయి. అప్పుడు నువ్వు నన్ను మా ఇంటికి సైకిల్‌మీద డ్రాప్ చేశావు... గుర్తుందా?"

"ఆఁ... గుర్తొచ్చింది. ముందు కూర్చున్న నువ్వు ముందు చక్రంలో కాలు పెట్టేశావు. ఇద్దరం పడిపోయాం."

"నీకు మాత్రం ఏ దెబ్బలూ తగల్లేదు గానీ నా కాలి మడమమీద పెద్ద దెబ్బే తగిలింది. చూడు. ఆ మచ్చ ఇప్పటికీ ఉంది" అని, పరికిణీని కొంచెం పైకెత్తి చూపించింది.

అవును కుడి కాలి మడమ దగ్గర ఇప్పటికీ ఆ మచ్చ ఉంది.

"అందుకే నన్నమాట నే న్నీకు గుర్తున్నాను !"

"కేవలం అందుకే కాదులే. నువ్వంటే నాకు చిన్నప్పటినుంచీ ఇష్టం. ఈ మచ్చ ని న్నెప్పుడూ గుర్తు చేస్తుంటుంది. నువ్వు గుర్తొచ్చిన ప్రతిసారీ నా కదేలా అయిపోతుంటుంది."

"మరి ఇన్నాళ్ళూ రాలేదేం?"

"చిన్నప్పుడు ఏదో కాలం అలా గడిచిపోయింది. పెద్దదా న్నయ్యాక మాత్రం నువ్వు రోజూ గుర్తొచ్చేవాడివి. రావాలని ఉన్నా న న్నొక్కత్తినీ ఎక్కడికీ పంపరు మావాళ్ళు. ఇప్పుడంటే కాలేజీ ఇక్కడే కదా, అందుకే వచ్చాను. వచ్చేముందు అత్తయ్య ఏమంటుందో అనుకున్నాను కానీ, నే ననుకున్నట్లుగా మాట్లాడలేదు అత్తయ్య."

"ఛఛ ! పెద్దవాళ్ళ మధ్య ఉన్న గొడవలవల్ల పిల్లల్ని ఏమైనా అనే మనస్తత్వం కాదు మా అమ్మది" అన్నాను నేను.

అమ్మ కాఫీ గ్లాసులతో వచ్చింది. మరో పావుగంట ఉండి వెళ్ళిపోయింది సుజాత. ఫెన్సింగ్ గేటు వేస్తున్నట్టుగా నటిస్తూ - "అప్పుడప్పుడూ వస్తుండు" అని సుజాతకే వినిపించేలా అన్నా న్నేను.

ఒక్కసారిగా వచ్చి చాలా మామూలుగా ఉండే నా మానసిక పరిస్థితిలో చాలా మార్పు తీసుకొచ్చింది సుజాత. వారాని కోసారైనా వచ్చి తన మాటలతో నా మనసుని తాకేది.

నేను సిటీలో ఉన్న కాలేజీలో చదివేవాడ్ని. మధ్యాహ్నాం పిరియడ్స్ కాన్సిల్ అయినప్పుడో, ప్రాక్టికల్స్ పూర్తైపోయినప్పుడో మధ్యాహ్నామే ఇంటికి వచ్చేసేవాణ్ణి. అలాంటప్పుడు నా కనిపించేది జూనియర్ కాలేజీ టైమ్ అయిపోయే సమయంలో వెళ్ళి సుజాతను కలవాలని. అలా చాలాసార్లు వెళ్ళాను. కాసేపు మాట్లాడుకొనేవాళ్ళం. అలా మాట్లాడిన తరువాత నేను ఆ రోజంతా ఎంతో హాయి ఫీలయ్యేవాడిని. ఎప్పుడూ చదువుకుంటూ, రికార్డ్స్ గీసుకుంటూ ఉండే నాలో ఏదో కొత్త ఉత్సాహం నిండినట్టుగా ఉండేది.

ఓ రోజు సుజాత మా ఇంటికి వచ్చింది. నేను కూడా అప్పుడే వచ్చాను కాలేజీ నుంచి. అమ్మ అప్పుడే పాలకు వెళ్ళింది. అప్పు డో మాట అంది సుజాత నాతో.

"బావా... నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నే నంటే నీ కిష్టమేనా?"

తల పంకించాను నేను.

"నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

"డిగ్రీ పుర్తవ్వాలి, నిరుద్యోగ సముద్రం ఈది ఒడ్డుకు వచ్చాక ఆలోచిద్దాం ఆ విషయాన్ని."

"అంతవరకూ నే నాగుతాను."

సుజాతనైతే ఇష్టపడ్డాను కానీ, పెళ్ళి అనేసరికి నాలో ఏదో బెరుకుదనం పుట్టుకొచ్చింది అప్పుడు. నే నున్న ఆ వయసు, పరిస్థితి, మా కుటుంబాల మధ్య ఉన్న కలతలే ఆ బెరుకుకు కారణాలు.

అయినా ఓ రోజు అమ్మతో అనేశాను కూడా - "అమ్మా ! నా డిగ్రీ అయిపోయాక, ఉద్యోగం వచ్చాక సుజాతను పెళ్ళి చేసుకుంటా నమ్మా."

నా మాటలకు ఆశ్చర్యపోయిందో మరేమో, ఒక నిముషం ఏమీ అనలేదు. ఆ తరువాత నావైపు చూసి నవ్వింది. మళ్ళీ సీరియస్‌గా ముఖం పెట్టింది.

"ఒరే వంశీ ! ను వ్వున్న వయసు అటువంటింది. కాస్త ఎర్రగా, పుష్టిగా ఉన్న అమ్మాయి కనిపించి మాట్లాడితే పెళ్ళి చేసుకోవా లనిపిస్తుంది. నీ కేమిట్రా, అంతకంటే అందమైన అమ్మాయి దొరుకుతుంది."

"అది కాదమ్మా. సుజాత అంటే నాకు ఇష్టం. నేనన్నా సుజాతకు ఇష్టమే."

"అని చెప్పిందా?"

అవునన్నట్టు తలూపాను నేను.

"అయితే ఇది వాళ్ళు పన్నిన వలే అయ్యుంటుంది."

"ఎవరమ్మా?"

"ఇంకెవరు? సుజాత అమ్మ, నాన్నానూ. ఒక్కడే కొడుకువి, బుద్ధిమంతుడివి - ఏ బాదరబందీ లేకుండా ఉంటుందని సుజాతను ఎరగా వేశారన్న మాట."

"ఛ, అలా అంటావేంటమ్మా? సుజాత చాలా మంచిది."

"అది మంచిదేరా. కానీ ఆ కుటుంబంలోని వాళ్ళే మంచివాళ్ళు కాదు. సుజాత అక్కకు పెళ్ళయిన సంవత్సరంలోనే ఏదో చేసి అల్లుడిని ఇంట్లోకి తెచ్చేసుకున్నారు. నువ్వు మా కొక్కడివే కొడుకువాయె. వద్దురా వంశీ ! ను వ్వలాంటి ఆశలూ, ఆలోచనలూ పెట్టుకోవద్దు. నీకు అందమైన జీవితాన్ని అందించే చక్కని అమ్మాయిని చేస్తాను."

ఇక అమ్మతో నే నేమీ మాట్లాడలేకపోయాను.

ఒకసారి దారిలో కనిపించిన సుజాత వాళ్ళింటికి రమ్మంది. నేను ఎంత వెళ్ళకూడదనుకున్నా, సుజాత బలవంతంమీద వెళ్ళాల్సొచ్చింది. వా ళ్ళింట్లో వాళ్ళు నాతో చాలా బాగా మాట్లాడారు.

"ఏమిటో నాయనా, ఎంతో ఇదిగా ఉండే మన కుటుంబాలు, మగవాళ్ళ మాట పట్టింపులవల్ల విడిపోయాయి. విడిపోయిన మన కుటుంబాలు మళ్ళీ మీ ఇద్దరివల్లా కలవాలి. అలా కలిస్తే ఆనందించాలని ఉంది నాయనా !"

సుజాత వాళ్ళమ్మగారు అలా అనేసరికి నాకు ఎందుకో అమ్మ అన్న మాటలు గుర్తొచ్చాయి. నేను అనుమానంగా చూశాను సుజాత వైపు. సుజాత సిగ్గుపడుతూ గదిలోకి వెళ్ళిపోయింది.

మళ్ళీ ఒకసారి సుజాత కనిపించినప్పుడు - "నేను మా ఇంట్లో చెప్పేశాను. నువ్వు మీ ఇంట్లో చెప్పావా?" అంది.

**భయం**

భార్య: ఏమండీ ! అబ్బాయి పెళ్ళంటే భయపడుతున్నాడండీ?

భర్త: తెలుసులే... మన పెళ్ళయ్యేవరకూ అసలు భయమంటే ఏమిటో నాకు తెలియదుగా !

-కె. సత్యవల్లి
[పెనుగొండ]

అప్పటికి నేను డిగ్రీ పూర్తిచేసి ఖాళీగా ఉన్నాను. "ఏమిటి సుజాతా చెప్పడం? ఉద్యోగం రావాలిగా. ఉద్యోగం రానిదే చెప్తే ఏం బాగుంటుంది?" అన్నాను.

"అది కాదు బావా. మీ ఇంట్లో ఏమంటారో అని. మీ ఇంట్లో ఏమన్నా నన్నే పెళ్ళి చేసుకుంటానని ఒట్టేయి" అని చేయి చాపింది.

ఎందుకో నాకు ఒళ్ళు మండింది. "ఏమిటిది రోడ్డుమీద? ఉద్యోగం వచ్చిన తరువాత తప్పకుండా అడుగుతాను, అడిగినప్పుడు కాదంటే అప్పుడు ఆలోచిద్దాంలే" అన్నాను.

"కోరి వస్తే అలాగే ఉంటుంది. నేను నీ వెంట పడుతున్నానా, మన కులం కాని మరో అబ్బాయి నన్ను పెళ్ళి చేసుకుంటానని నా వెంట పడుతున్నాడు. మొన్న ఇంట్లో కూడా అడిగేశాడు ధైర్యంగా. మావాళ్ళు నాలుగు చీవాట్లు పెట్టి బయటకు తగిలేశారు" అంది.

ఆ మాటలకు నేనేమీ అనలేదు.

"బావా ! నేను నీకోసం ఎన్నాళ్ళైనా ఆగుతాను. నువ్వు స్థిరపడ్డాక నన్ను మరిచిపోవు కదూ?"

అంతవరకూ కాస్త అదోలాగే మాట్లాడినా సుజాత అలా అడుగుతుంటే నాకు తెలియకుండానే మెత్తబడ్డాను.

"అలాగే సుజాతా ! నాకు ఉద్యోగం వచ్చాక మా ఇంట్లో వాళ్ళను ఒప్పించి నిన్ను పెళ్ళి చేసుకోవడం ఖాయం. సరేనా?" అన్నాను.

అప్పుడు సుజాత ముఖంలో కనిపించిన భావంలో ఏదో స్వచ్ఛత కనిపించింది. కానీ జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే... సుజాత వాళ్ళింట్లో వాళ్ళ మాటలు వింటుంటే అమ్మ అన్న మాటలు నా మనసుమీద పని చేయడం జరుగుతూంది.

ఒక రోజు సుజాత మా ఇంటికి వచ్చింది. చాలా అందంగా ముస్తాబు చేసుకుంది, చాలా ఆకర్షణీయంగా కనిపిస్తూంది.

"అత్తయ్యా ! ఈ రోజు నా పుట్టిన రోజు" అని చెప్పి, ఓ పాకెట్ అందించింది మా అమ్మకు. నాకూ ఓ పాకెట్ అందించింది కొంటెగా చూస్తూ.

"ముందు చెప్పలేకపోయావా సుజా..."

నా మా టింకా పూర్తి కానేలేదు. "వంశీ ! ముందు నువ్వు గదిలోకి వెళ్ళు !" అంది గట్టిగా అమ్మ.

నాకేమీ అర్థంకాక అలాగే నిల్చుండిపోయాను.

"చెప్తుంది నీకే !" గర్జించింది అమ్మ.

లోపలకు వెళ్ళక తప్పలేదు నాకు.

గదిలోకి వెళ్ళిపోయిన నాకు సుజాతతో అమ్మ అంటున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"చూ డమ్మాయ్ ! ఇన్నాళ్ళూ నువ్వు మా ఇంటి 'కొచ్చావు, నే నేమీ అనలేదు. ఇప్పుడు అనక తప్పడంలేదు. ఇక ముందెప్పుడూ మా ఇంటికి రావొద్దు. మావాడిమీద ఆశలు పెట్టుకోవడం కానీ, వాడిలో ఆశలు రేపడం కానీ చేయొద్దు. ఎందుకంటే వాడి కింకా ఉద్యోగమూ లేదు, సద్యోగమూ లేదు. ఉద్యోగం వచ్చినా వాడు నిన్ను పెళ్ళి చేసుకోడు. నేను బ్రతికి ఉండగా నువ్వు ఈ ఇంటి కోడలివి కాలేవు. ఆశలు పెంచుకొని బాధపడే కంటే ఆదిలోనే తుంచేసుకోవడం మంచిది ! ఇక ను వ్వెళ్ళు !"

అమ్మ చాలా కటువుగా మాట్లాడింది. నేను విసురుగా బయటకు వచ్చాను. అప్పటికే సుజాత మా ఫెన్సింగ్ గేటు తీసుకొని పరుగులాంటి నడకతో వెళ్ళిపోతూంది.

"అలా అనడానికి నాకూ బాధగానే ఉందిరా ! కానీ ఇలాంటి విషయాల్లో అలాంటి మాటలే బాగా పని చేస్తాయి" నాతో అని, అమ్మ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

చాలా రోజులు నేను అదోలాగే ఉన్నాను.

ఓ నెల.రోజు లవుతుందేమో, సుజాత వాళ్ళింటి దగ్గర్లో ఉన్న మా చుట్టం ఒకాయన మా ఇంటికి వచ్చాడు. అతను చెప్పిన విషయం విని ముందు నేను నమ్మలేకపోయాను.

అతను వెళ్ళిపోయాక అమ్మ నాతో అంది - "వంశీ చూశావా? నీ తల్లి చేసింది మంచో, చెడో ఇప్పుడైనా అర్థమైందా? నిన్ను ప్రేమించినదే అయితే నీకోసం జీవితాంతం కన్యగానే ఉండిపోతుంది. కానీ, అలా మరో కులం వాడితో వెళ్ళిపోతుందా?"

ఆ మాటలు నాకు ఛెళ్ళుమని తగిలాయి. అమ్మ ఇంకా చాలా అంది. నేను కూడా అమ్మని చాలా అందామనుకున్నాను గానీ, అనగలిగే శక్తి నా మనసుకి లేకపోయింది.

కానీ ఎప్పుడూ నాకు సుజాత ఆ రోజు అన్న మాటలే గుర్తొచ్చేవి. "మన కులం గాని మరో అబ్బాయి నన్ను పెళ్ళి చేసుకుంటానని నా వెంట పడుతున్నాడు. మొన్న ఇంట్లో కూడా అడిగేశాడు ధైర్యంగా. మా వాళ్ళు నాలుగు చీవాట్లు పెట్టి బయటకు తగిలేశారు."

కరుగుతున్న కాలంలో నాకు ఉద్యోగం రావడం, పెళ్ళి జరగడం, ఓ పాప పుట్టడం అన్నీ జరిగిపోయాయి గానీ, సుజాత అప్పటి నుండి ఇప్పటివరకూ నాకు కనిపించలేదు.

బస్సు గాజువాకలో ఆగింది.

నేను కూడా ఆలోచనల్లోంచి బయటపడ్డాను. నే నక్కడ దిగిపోవాలి గానీ దిగలేకపోయాను. నా ఎదురు సీట్లో కూర్చొని ఉన్న ఆమె సుజాతే అని నా కిప్పటికీ అనిపించడమే నేను బస్సు దిగలేకపోవడానికి కారణం.

ఆమె ఇంకా అలాగే తన ముఖం నా కేమాత్రం కనిపించకుండా కూర్చుంది. రోడ్డుమీదకు చూసినా అరచేతిని తన చెంపమీద పెట్టుకొని చూస్తోంది తనను నేను గుర్తుపట్టకుండా ఉండేందు కన్నట్లుగా...

నా కెందుకో ఆమె సుజాతే అనిపిస్తూంది.

ఓ రెండేళ్ళ క్రితం సుజాత తన భర్తతో నాతయ్యపాలెంలో ఉంటున్నట్లు, తన తల్లిదండ్రుల దగ్గరకు భర్తతో సహా వెళ్తూ వస్తున్నట్లుగా తెలిసిన వాళ్ళ ద్వారా తెలిసింది.

ఆమె సుజాతే అయితే నాతయ్యపాలెంలో దిగుతుంది. అప్పుడు నాకు చూడ్డానికి అవకాశం ఉంటుంది. ఆమె సుజాత కాకపోతే పర్వాలేదు.

అయితే ఒక్కసారి చూసి మళ్ళీ వెనక్కి వచ్చేయొచ్చు.

ఎందుకు చూడ్డం? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ఎందుకో చూడకుండా బస్సు దిగి వెళ్ళిపోలేను.

బస్సు కదిలింది. పాత గాజువాకలో ఆగింది. బస్‌లోంచి చాలామంది దిగడంవల్ల, కొంతమంది ఎక్కడంవల్ల రష్ కొద్దిగా తగ్గింది.

నేను మళ్ళీ పరిశీలనగా ఆమెను చూశాను. ఎంత చూసినా నాకు ఏమాత్రం అనుమానం రావడంలేదు - ఆమె సుజాత కాదని.

బస్ కదలి భారత్ హెవీ ప్లేట్స్ దగ్గర ఆగింది. తరువాతి స్టాపే నాతయ్యపాలెం.

ఎందుకో నాలో అలజడి పెరిగింది.

మరో మూడు నిముషాలు గడిచాక బస్సు నాతయ్యపాలెం స్టాపు దగ్గర ఆగుతుందనగా ఆమె ఇక్కడ దిగుతుందా, లేదా అని నే నామెవైపు పరిశీలనగా చూశాను.

నా ఊహ తప్పు కాలేదు. ఆమె అక్కడ దిగడాని కన్నట్లుగా సర్దుకొని తరువాత లేచి నిలబడింది. అప్పుడు కూడా ఆమె తన తలను ఏమాత్రం ఇటు పక్కకు తిప్పకుండానే, ఆ సీటు పక్కన నిలబడి ఉన్న ఆడవాళ్ళ మధ్య నుంచి ముందుకు వెళ్ళిపోయింది.

అప్పుడు నేను చాలా ప్రయత్నించాను ఆమెను చూడడానికి. కానీ నాకు ఏమాత్రం అవకాశం రాలేదు. అప్పుడు గుర్తొచ్చి గాజువాక నుండి నాతయ్యపాలానికి టికెట్ తీసి నేను కూడా వెంటనే బస్సు దిగిపోయాను. బస్సు దిగిన వెంటనే ఆమె కనిపించకుండా ఎటువైపుకి వెళ్ళిపోతుందోనని ఆత్రతగా అటూ ఇటూ చూశాను.

ఆమె కాస్త దూరంలో వెళ్ళిపోతూ కనిపించింది. విచిత్రం, ఆమె నడక కూడా అచ్చం సుజాత నడకలాగే ఉంది.

నేను అడుగులు వడివడిగా వేశాను.

ఆమెకూ, నాకూ మధ్య రెండు అడుగుల దూరం ఉంటుందేమో... సరిగ్గా అప్పుడే ఓ స్కూటరతను ఎందుకో సడన్ బ్రేక్ వేయడంవలన వచ్చిన కీచుమన్న శబ్దానికి ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూసింది.

వెనక్కి తిరగబోతున్న ఆమెను చూసే అవకాశాన్ని జారవిడుచుకోవడం ఇష్టం లేకపోయింది గానీ, లేకపోతే అత నంత సడన్ బ్రేక్ ఎందుకు వేశాడా అని నేనూ వెనక్కి తిరిగి చూసేవాడినే.

అలా ఆమె వెనక్కి తిరిగినప్పుడు కనురెప్ప వేయకుండా చూశా నామెను.

ఆమె సుజాతే అయ్యుంటుందన్న నా ఊహ నిజం కాలేదు !

నే నక్కడే ఆగిపోయి నిలబడిపోయాను. ఎందుకో విచిత్రంగా అప్పటి కప్పుడే గుండె బరువెక్కిపోయింది.

నే నీ బస్సు ఎక్కకపోయినా, ఆమె నాకు కనిపించకపోయినా, ఆమె వెనుక నుంచి అచ్చం సుజాతలా ఉండి ఉండకపోయినా... గతం అనే నల్లమబ్బులోంచి ఓ చినుకు రాలిపడి నా గుండెను బరువెక్కించి ఉండేది కాదేమో !?

అప్పుడే కాంప్లెక్స్ నుంచి గాజువాక వెళ్ళే సిటీ బ స్సొచ్చి ఆగింది అక్కడ. ★